

# కథా కౌముది

## వంశీ వసుంధర

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
### సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

"వంశీ నా భార్య విమలని రేప్ చేసాడు కానీ ఆమెకా విషయం తెలియదు కవి గారూ!" అన్నాడు దిగ్విజయ్.

రవి కాంచనివి కవి కాంచగలడని నా ఇన్వెస్టిగేటివ్ ఏజన్సీకి 'కవి శోధన' అని పేరెట్టాను. నా శోధనకి మారువేషాలుండవు. పిస్తోళ్లు వాడను. మనసుల లోతుల్లోకెళ్లి రవి కాంచని అంశాలు తెలుసుకుని విశ్లేషించడం నా పద్ధతి. నాకు అసిస్టెంటంట్లూ ప్రత్యేకంగా లేరు. తెలిసినవారి సాయం తీసుకుంటాను. వీలునుబట్టి ఎంతోకొంత ప్రతిఫలం ముట్టజెబుతాను.

నాకొచ్చేవన్నీ చిత్రమైన కేసులే. అలాంటిదే ఇది.

రేప్ జరిగిన విషయం బాధితురాలికి తెలియకపోవడం అసంభవం కాదని నాకు తెలుసు. కానీ దిగ్విజయ్ భార్య పిచ్చిది కాదుట, కోమాలో లేదుట. వంశీ ఆమెని రేప్ చేసినప్పుడామె ఆల్కహాలు లేక నిద్రమాత్రల మత్తులో కూడా లేదుట.

"నటిస్తోందేమో" అన్నాను.

"ఆమె అసత్యమాడదు. ఆమెకి నటన తెలియదు. విలువల్ని నమ్మే సచ్ఛీలత ఆమెది"

"ఐతే రేప్ జరగనేలేదేమో"

"వంశీ ఆ రోజు మా ఇంట్లో ఒక రాత్రంతా గడిపాడు"

"కావచ్చు– కానీ మీరప్పుడు ఇంట్లో లేరుగా! అక్కడేం జరిగిందీ మీకు తెలియదు"

"వంశీ స్త్రీలోలుడే కాదు, వశీకరణ విద్యలో ఆరితేరినవాడు. అందుకే– కాలేజి రోజుల్నించీ తెలిసిన వంశీని నేను మా ఇంటికి ఒక్కసారి కూడా ఆహ్వానించలేదు. ఆ రోజు కూడా నేను లేననే వాడా సమయంలో మా ఇంటికి వెళ్లాడు"

"అంటే మీకు మీ భార్యమీద నమ్మకం లేదు" అన్నాను.

"నాకు నాభార్యమీద పూర్తి నమ్మకముంది. ఐతే అంతే నమ్మకం వంశీమీదా ఉంది"

అసలీ వంశీ ఎవరన్నట్లు చూసాను. దిగ్విజయ్ గొంతు సవరించుకున్నాడు.

– – – – –

దిగ్విజయ్‌కీ, వంశీకీ కాలేజిలో డిగ్రీ చదువుతున్నప్పుడు పరిచయమైంది. వంశీది సుమారైన పెర్సనాలిటీ. సుమారైన అందం. కానీ కాలేజీ బ్యూటీల్ని కూడా తన చుట్టూ తిప్పుకునేవాడు. అతడంటే అసూయ ఉన్నా– అబ్బాయిలందరూ స్నేహభావంతోనే ఉండేవారు– అమ్మాయిలకి లైనేసే టిప్పు చెబుతాడన్న ఆశతో. అలా దిగ్విజయ్ కూడా వెంటబడితే, "నువ్వు ప్రేమించిన అమ్మాయిని చూపించు. ఇప్పటికే ఆమె నా గర్ల్‌ఫ్రెండ్ అయుంటే నీకు నో ఛాన్స్!" అన్నాడు వంశీ.

"ఇంకా ఎవర్నీ అనుకోలేదు. నీ దగ్గిర టిప్స్ తీసుకున్నాకనే నా సెలక్షన్ మొదలు..."

"ముందో అమ్మాయిని ఎన్నుకో. నచ్చేలా మాట్లాడు. నచ్చేలా మసలు. ఖర్చుకి వెనుకాడకు. మాటకి మాట అనకు. తేలిగ్గా తీసిపారేస్తే తేలిగ్గా తీసుకో. దేవతకి భక్తుడిలా ఉండు– ఆ తర్వాత ఆమెకు నువ్వే దేవుడివి. ద్వాపరంలో శ్రీకృష్ణపరమాత్మ చేసిందదే!" అన్నాడు వంశీ.

అది స్వోత్కర్షలా అనిపించినా భరించడం తప్పని సరైంది దిగ్విజయ్‌కి, "నచ్చేలా మాట్లాడ్డానికీ, మసలడానికీ టిప్స్ చెప్పు మరి" అన్నాడు.

"అమ్మాయిలంతా తలో రకం. పరిచయం చేసుకుని స్టడీ చేసాకనే టిప్స్ తెలుస్తాయి. నా స్టడీ తర్వాత ఆమె నా ఫ్రెండౌతుంది తప్ప నీకు దక్కదు. నీకులా టిప్సడిగిన వాళ్ల కాండిడేట్లతోనే నా గర్ల్ ఫ్రెండ్స్ నంబరు నానాటికీ పెరిగిపోతోంది. ఇది నేర్పితే నేర్చుకునే విద్య కాదు. నీకు నువ్వుగా ఓ మెథడాలజీ డెవలప్ చేసుకో. సక్సెసైతే ఓకే. ఫెయిలైతే ఇంకో రూటు. ట్రయల్ అండ్ ఎర్రర్ మెథడ్‌లో– ట్రై, ట్రై, అండ్ ట్రై అగైన్ టిల్ యూ సక్సీడ్" అన్నాడు వంశీ.

"ఒక్క కేసులో నీ మెథడాలజీ ఏంటో కాస్త వివరించు. అందులోంచీ టిప్స్ నేనే ఏరుకుంటాను" నోరు విడిచి అడిగాడు దిగ్విజయ్.

"మెథడాలజీ అంటూ ఏదీ లేదు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు నాకు సమ్మోహనశక్తి సహజంగా అబ్బింది. అమ్మాయి నచ్చగానే- ఎవరో చెవిలో చెప్పినట్లౌతుంది. ఇన్స్ట్రక్షన్సు ఫాలో ఐపోతాను. ఇంతవరకూ ఫె¦యిల్యూరన్నది ఎరుగననుకో" అన్నాడు వంశీ.

"ఐతే ప్రేమకి టిప్సుండవంటావ్" అన్నాడు దిగ్విజయ్ నిరుత్సాహంగా.

"ఎస్- ప్రేమ మదిలో తనంత తానే పుట్టుకొచ్చే పవిత్రభావన. అది కొన్నేళ్ల సాహచర్యంలోంచీ పుట్టుకురావచ్చు. తొలిచూపులోనే పుట్టవచ్చు. నేను చెప్పేది అలాంటి ప్రేమ గురించి కాదు. ప్రేమలోంచి పుట్టిన కాంక్ష గురించి..." క్లారిఫై చేసాడు వంశీ.

దిగ్విజయ్‌కి జుగుప్సాకరంగా అనిపించి అదోలా అతడివంక చూసి, "ఛీ- ఐతే నేను నిన్ను కాంక్షకి టిప్సడిగాననుకున్నావా?" అన్నాడు.

"కాంక్ష కాకపోతే- బుద్ధిగా చదువుకోక అమ్మాయిలతో పరిచయాలూ, వాటికి టిప్సూ ఎందుకుట!" అన్నాడు వంశీ నిరసనగా.

దిగ్విజయ్ తడబడి, "ఈ వయసుకి అమ్మాయిలంటే క్రేజ్ సహజం. అది కాంక్ష కాదు. రిలీజైన రోజే కొత్త సినిమా చూడాలనుకున్నట్లే- అదో తపన- అంతే!" అన్నాడు.

"కానీ నా ప్రేమలో మాత్రం కాంక్ష ఉంది. లేకుంటే- ఒకే అమ్మాయితో సరిపెట్టుకునేవాణ్ణిగా"

అతడంత పచ్చిగా నిజాన్ని ఒప్పుకుంటాడని దిగ్విజయ్ ఊహించలేదు. ఓ క్షణమాగి, "నీ ప్రేమలో ఉన్నది కాంక్ష అని- నీతో తిరిగే అమ్మాయిలకి తెలుసా?" అన్నాడు.

"వాళ్ల గురించి నాకు తెలిసిందల్లా ఒక్కటే! వాళ్లు మేజర్లు" అన్నాడు వంశీ.

"మేజర్లైనంతమాత్రాన అమాయకులు కాకూడదని లేదు కదా!"

"ఎదుటివాళ్లలో అమాయకత్వాన్ని చూసేవాళ్లు తప్ప- ఈ ప్రపంచంలో అమాయకులంటూ ఎవరూ లేరు" తాపీగా అన్నాడు వంశీ.

"ఐతే వాళ్లకి మదపిచ్చి అనుకోవాలి"

అప్పుడు చూసాడు దిగ్విజయ్- వంశీ కళ్లలో ఎరుపు, "మనం కాంక్షించే మనిషిమీద గౌరవముండాలి. లేకుంటే మనకి కాంక్షించే అర్హత లేదు" అన్నాడతడు.

దిగ్విజయ్‌కి వంశీ మనోగతం అర్థం కాలేదు. అమ్మాయిలతో అక్రమసంబంధం పెట్టుకోవడం వాళ్లని గౌరవించడమౌతుందా?

ఇంతకీ కాలేజిలో వంశీకి చెడ్డపేరు లేదు. బెస్ట్ స్టూడెంటు కాకపోయినా ఫస్ట్ క్లాసు స్టూడెంటుగా పేరు తెచ్చుకున్నాడు. అమ్మాయిల్లో అతడికి చెడ్డవాడన్న పేరు లేదు. పైగా ఎంతో కొంత ఆరాదనాభావం కూడా ఉంది. ఆ కారణంగా అబ్బాయిలూ అతణ్ణి గౌరవించేవారు.

డిగ్రీ పూర్తి కాగానే ఇద్దరికీ ఒకే కంపెనీలో కాల్‌సెంటర్ జాబ్స్ వచ్చాయి. ఇద్దరూ కొన్నాళ్లు ఓ పెద్దింట్లో చిన్న రూంలో అద్దెకున్నారు. ఆ ఇంటి ఓనరు కోడలు సుగుణతో అక్రమసంబంధం పెట్టుకున్నాడు వంశీ. దిగ్విజయ్‌లో కొంత భయం, కొంత ఆకర్షణ. కొంత ఆశ కూడా ఉందేమో– అతడా రూం ఖాళీ చేసి వెళ్లిపోవాలనుకోలేదు. సుగుణ చెప్పుకోతగ్గ అందగత్తె మరి!

వంశీ, దిగ్విజయ్– రాత్రి పదింటికి డ్యూటీకి వెళ్లి ఉదయం ఎనిమిదింటికి తిరిగొచ్చేవారు. ఆ ఇంటి ఓనరు, కొడుకు ఉదయం పదింటికి బయటికెళ్లి రాత్రి ఏడింటికి తిరిగొచ్చేవారు. ఇంట్లో అత్త, సుగుణ ఉండేవారు. అత్తకి పెత్తనాలెక్కువ. క్లబ్బులు, పార్టీలు అంటూ ఎక్కువగా ఇంటి బయటే ఉండేది. రోజంతా సుగుణొక్కతే ఇంట్లో ఉండేది. ఆమెకింకా పిల్లలు లేరు.

సుగుణ అప్పుడప్పుడు కబుర్లకి వీళ్ల రూంకి వచ్చేది. అప్పుడే సంకేతాలయ్యేయో కానీ– ఆ తర్వాతనుంచి వంశీ తరచుగా ఏదో సమయంలో ఆమె వాటాకి వెళ్లి వస్తూండేవాడు.

“తప్పు చేస్తున్నావ్– నీ మూలంగా ఓ నిండు సంసారం నిలువునా కూలిపోతుంది” అని దిగ్విజయ్ పలుమార్లు వంశీని హెచ్చరించాడు.

వంశీ చలించకుండా, “స్త్రీ ఆకర్షణలో తప్పొప్పుల ఆలోచన ఉండదు పురుషుడికి. నీకు తప్పనిపిస్తే ఆమెని హెచ్చరించు” అన్నాడు. దిగ్విజయ్ ఆమెని హెచ్చరించాలని నిర్ణయించుకుంటే, “నీకు నిజంగా ఆమెపై జాలుంటే సరే కానీ– నాకు దగ్గిరైంది కదా, నీకూ దగ్గిరౌతుందేమోనన్న ఆశతో మాత్రం వెళ్లకు. ఆమె నిప్పు” అని హెచ్చరించాడు కూడా.

“తల్లి–పుట్టిల్లు–మేనమామ సామెతలా ఉంది– నువ్వామెని నిప్పు అనడం” అన్నాడు దిగ్విజయ్ ఎకసక్కెంగా. ఐతే ఆమెపై తనకి ఆశ ఉందన్న అనుమానం దిగ్విజయ్‌కీ లేకపోలేదు. కానీ లేదని తనని తాను నమ్మించుకున్నాడు. లేకుంటే ఆమెని కలుసుకునేందుకు వంక ఉండదు.

“నీకేం తెలుసని మేనమామ లెవెల్ క్లెయిం చేస్తున్నావ్? నాకామెతో సంబంధం ఉన్న మాట నిజం. కానీ ఆ విషయమామెకి తెలియదు. కాబట్టి ఆమె నిప్పే!” అన్నాడు వంశీ.

దిగ్విజయ్ తెల్లబోయాడు. వంశీ ఇచ్చిన వివరణ అతణ్ణి దిగ్భ్రాంతుణ్ణి చేసింది.

వంశీ ఆమెతో కబుర్లు చెబుతూ చెబుతూ నెమ్మదిగా వశీకరణకు గురి చేస్తాడు. అప్పుడామె తన ఎదుటనున్నది భర్తే అనుకుంటుంది. భర్తతోలాగే మసలుతుంది. భర్తకి సహకరించినట్లే సహకరిస్తుంది. అతడామెకి అందించే ప్రేమాభిమానాలు ఎంత గొప్పగా ఉంటాయంటే– ఆమెకి ఆ రోజునించీ భర్తపై ప్రేమ ఇతోధికమౌతుంది.

అందుకు కారణమయ్యాడని వంశీని కూడా మరింత ఎక్కువగా అభిమానిస్తుంది. ఐతే వంశీతో తనకేర్పడిన సంబంధం గురించి ఆమెకి తెలియదు. అదే– అతడికి పుట్టుకతో వచ్చిన వశీకరణశక్తి ప్రభావం.

"నేను నమ్మను" అన్నాడు దిగ్విజయ్.

"నమ్మడం నమ్మకపోవడం నీ ఇష్టం. నువ్వామెతో ఏకాంతంగా పది నిముషాలు మాట్లాడి చూడు. ఆమె నిప్పని నువ్వే అంటావు" సవాలు చేశాడు వంశీ.

ఒకరోజు దిగ్విజయ్ సుగుణని ఏకాంతంగా కలుసుకున్నాడు. ఆమె అతడివద్ద ఏమాత్రం సంకోచం లేకుండా వంశీ మంచితనం, గొప్పతనం గురించి చెప్పింది. అతడితోనూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది. కానీ ఆ మాటల్లో ఓ నిప్పుతనం. ఆమెలో తప్పెంచడం అసాధ్యం.

మరి వంశీ– ఆ నిప్పుని– కాల్చే స్థాయినుంచి వెచ్చదనమిచ్చే స్థాయికి తీసుకొచ్చాడు. తనూ అలా చేయగలగాలి. ఆమె తనకి వశమైతే అప్పుడు తప్పొప్పులు చెప్పి మంచి దారిలో పెట్టాలి. అలా తన్ను తాను నమ్మించుకుని– అదే పనిగా ఆమె అందాన్ని పొగిడాడు. అమ్మాయిల్ని మెప్పించడానికి అతడికి తెలిసిన ఉపాయమదొక్కటే!

ఆమె సిగ్గు పడలేదు. "వంశీ సాహచర్యంలో మాటలు బాగానే నేర్చావు. ఇలా పొగిడేవాళ్లని అమ్మాయిలు బాగా ఇష్టపడతారు. త్వరగా పెళ్లి చేసుకో" అంటూ అతడి పొగడ్తలకి అందని ఓ చిరునవ్వు విసిరింది.

దిగ్విజయ్ సిగ్గుపడి, "ఇంట్లో సంబంధాలు చూస్తున్నారు" అన్నాడు.

"వద్దని చెప్పు. ఎందుకంటే నీ రూంమేట్ వంశీ– కంపెనీకి ఎక్స్‌ట్రాఆర్డినరీ. దాంతో– తోడు పట్ల నీ ఎక్స్‌పెక్టేషన్స్ ఎంత హైగా ఉంటాయంటే– పెద్దలు చూసే అమ్మాయి వాటిని మీటవలేదు. నా ఉద్దేశ్యంలో నీకు విమల రైటు. బాగా కలిగిన కుటుంబం. తనకి నా మాటంటే గురి. ఈ పెళ్లి జరిగితే నీ జాతకం మారిపోతుంది" అంది సుగుణ.

విమలకి అందం, ఐశ్వర్యం, మంచితనం, సంస్కారం అన్నీ పుష్కలం. ఇంట్లో ఆమెకున్న స్వేచ్ఛ కూడా పుష్కలం కాబట్టి– పెళ్లి విషయంలో అంతిమ నిర్ణయం ఆమెదే!

విమల అంత గొప్పదైతే– వంశీకే చెప్పొచ్చుగా అనిపించింది దిగ్విజయ్‌కి. అంతలోనే, వంశీని మరిగిందిగా– విమల పరం చేయడానికి మనసెలా ఒప్పుతుందిలే అని కూడా అనుకున్నాడు. పైకిమాత్రం, "నీకు విమల బాగా తెలుసన్నావ్. నన్ను చేసుకుంటే– ఆమె సుఖపడుతుందా– అది చెప్పు ముందు..." అన్నాడు. బదులుగా ఆమె తన ఔన్నత్యాన్ని ప్రస్తావిస్తుందని అతడాశించాడు కానీ– ఆమె నోట విమల ఔన్నత్యం మరి కాస్త వినాల్సొచ్చింది.

విమల పవిత్రతని నమ్ముతుంది. నిజాయితీగా ఉంటుంది. మానవత్వాన్ని ప్రేమిస్తుంది. అబద్ధాన్నీ, మోసాన్నీ ద్వేషిస్తుంది. తనవల్ల తెలియక తప్పు జరిగినా తన్ను తాను క్షమించుకోదు. శీలానికామె ఎంత ప్రాధాన్యమిస్తుందంటే– అది పోయిన మనిషికి మరణమే శరణ్యమంటుంది. తన ఆశయాలకి తగినవాడు భర్తగా లభిస్తే– అతడు ఆస్తి, అంతస్తు, హోదా, చదువు వగైరాల్లో తనకి సాటి రాకపోయినా– జీవితాంతం పురాణ స్త్రీలా గౌరవిస్తుంది.

“నేనీ సంబంధం వంశీకని చెప్పాను. విమల కేరక్టరు తెలిసేక అతడు– నువ్వే ఆమెకి తగినవాడివన్నాడు. వంశీ నిర్ణయాన్ని గౌరవించి నీ దగ్గిర ఈ ప్రస్తావన తెచ్చాను” అందామె.

“వంశీకి నాకంటే ఏం తక్కువని అలాగన్నాడు?” వంశీ గుర్తించాడనైనా ఆమె తన ఔన్నత్యాన్ని పొగడొచ్చని అతడి ఆశ. కానీ సుగుణ వంశీని తప్ప మరో మగాణ్ణి మెచ్చగలదా?

వంశీకి ఆడవాళ్లంటే జాలి, ప్రేమ, గౌరవం. అతడు పెళ్లంటూ చేసుకుంటే– అది పతితగా ముద్ర పడిన మహిళని ఉద్ధరించడానికే. ఇక అతడికి దిగ్విజయ్ మీద జాలి. తనకైతే ఇలాంటి సంబంధం ఎప్పుడైనా రావచ్చుగానీ దిగ్విజయ్‌కి కష్టంట. ఆశయం, అవకాశం లేని అతడికోసం విమలని త్యాగం చేసాడు వంశీ.

ఇది విన్న దిగ్విజయ్ కాస్త చిన్నబుచ్చుకున్నా– వంశీ అలాగనుకోవడం తనకి మేలే చేస్తోందని సరిపెట్టుకున్నాడు. ఐనా మనసులో ఓ మూల భయం– విమల కాదంటుందేమోనని.

సుగుణ ఈ విషయంలో గట్టిగానే పూనుకుందేమో– ఆ సమస్య రానే లేదు. దిగ్విజయ్‌కీ విమలకీ పెళ్లైంది. దిగ్విజయ్ మకాం ఓ పెద్ద బంగళాలోకి మారింది. సుగుణ చెప్పినట్లే నాటినుంచీ దిగ్విజయ్ జాతకం ఆ బంగళాకంటే కూడా గొప్పగా మారింది.

– – – – –

“బజార్లో పాలు దొరుకుతుంటే ఆవును కొనేవారుంటారా అనేవాట్ట గతంలో ఓ పెద్దాయన. వంశీకి పెళ్లెందుకు– కోరిన మగువ పొందు, కోరినప్పుడు లభిస్తుంటే! అప్పట్లో వాడు నాకుపకారం చేసాడనుకున్నా. వాడి సంగతి పూర్తిగా తెలిసినా, మిత్రుణ్ణి కాబట్టి నా భార్య జోలికి రాడనుకున్నా. చివరికిలా నా కొంప ముంచాడు” గొంతు గద్గదికమై ఆగాడు దిగ్విజయ్.

వంశీ వచ్చి వెళ్లేక విమల భర్తవద్ద అతణ్ణి తెగ మెచ్చుకుంటోందిట. భర్తమీద ఆమె ప్రేమ కూడా రెట్టింపైందిట. రెండు రెళ్లు అరు. ఇక దిగ్విజయ్‌కి వాళ్ల గురించి డౌటే లెదు.

అతడంత నమ్మకంగా చెబుతుంటే ఖండించి ప్రయోజనం లేదని, “ఇప్పుడేం చేయాలని మీ ఉద్దేశ్యం?” అన్నాను. అతడి ఉద్దేశ్యంలో నా పాత్రేమిటో తెలుసుకోవాలని నా ఆంతర్యం.

“వంశీలో సమ్మోహన శక్తి ఉంది. ఒకసారి మాయలో పడ్డాక, నా భార్య వాడి రాకపోకల్ని అరికట్టలేదు. వాడిక వస్తూపోతూనే ఉంటాడు. తనకి తెలియకుండానే ఆమె వాడి వశమై పోతూంటుంది. అలా ఎన్నాళ్లు? ఏదో రోజున నిజం బద్దలౌతుంది? ఆ రోజు– త్రికరణశుద్ధిగా శీలాన్ని నమ్మిన విమల గుండె బద్దలవడం ఖాయం. అది జరక్కుండా ఆపాలి....”

అర్థం చేసుకుందుకు మరికాస్త వివరణ అవసరమైంది నాకు.

మగాడు ఆడదాన్ని అణచి ఉంచడానికి సృష్టించిన పదాయుధం శీలం. దాన్ని దిగ్విజయ్ ఏమాత్రం నమ్మడు. శీలంకంటే విలువైనది సహజీవన సౌభాగ్యమనుకుంటాడు. అతడి దృష్టిలో విమల ఇప్పటికీ ఎప్పటికీ పరమ పవిత్రురాలు.

నేను నా సైకలాజికల్ పవర్ ఉపయోగించి ఈ విషయమై విమలని కన్విన్స్ చేయాలి. వంశీ నిజస్వరూపం వివరించి ఆమె అతణ్ణి దూరంగా ఉంచేలా చేయాలి. ఆమె ఏ అఘాయిత్యానికీ పూనుకోని విధంగా జరిగిన ఘోరం తెలియజేయాలి.

"ఇదంతా నేనే చేయొచ్చు. కానీ వంశీ తనని అనుభవించాడని తెలిసిన మరుక్షణం– ఆ షాక్‌కి ఆమె ప్రాణాలు పోవచ్చు. అది ఆపడానికి సైకలాజికల్ పవర్ అవసరం" అన్నాడతడు.

"భార్య దారి తప్పిందని తెలిసీ ఆమెని సహృదయంతో క్షమించడమే కాక మంచిదారికి మళ్లించడానికి నావంటివారి సాయం కోరే మీవంటి పురుషోత్తములు మన సమాజానికి గర్వకారణం. మీకు సాయపడ్డం నా కర్తవ్యం" అన్నాను.

2

దిగ్విజయ్ వెళ్లేక జరిగినదంతా విశ్లేషించుకున్నాను. అతడు చెప్పే పద్ధతి నాలో కొన్ని కొత్త ఆలోచనలు రేపింది.

దిగ్విజయ్ తనని ఉత్తముడుగా ప్రొజెక్ట్ చేసుకున్నాడు కానీ అతడికి వంశీ అంటే అసూయ, భయం. పరస్త్రీలమీద ఆశ ఉంది కానీ అవకాశంకోసం ఎదురు చూడ్డమే తప్ప చొరవ చేసే ధైర్యం తక్కువ. ఇక భార్య శీలం విషయంలో– అతడామె సచ్చరిత్రకీ, వంశీ సమ్మోహనశక్తికీ జరిగిన పోటీలో విజయమెవరిదో తేల్చుకోలేని సందిగ్ధంలో ఉన్నాడు. నా పరిశోధన ఆమె పవిత్రతని నిరూపిస్తే అతడికి సంతోషమో కాదో చెప్పలేను. కానీ– శీలం పోతే– అది నాద్వారా తెలుసుకుని ఆ షాక్ ఆమెని ఆత్మహత్యకి పురిగొల్పితే అప్సెట్ ఔతాడనిపించదు. తన చేతికి మట్టి అంటకుండా ఆమెను వదుల్చుకుందుకే అతడు నా దగ్గిరకొచ్చాడన్నా నేనాశ్చర్యపోను.

నేను మాత్రం నేరస్థులకి సహకరించను. నా ఛానెల్స్ ఉపయోగించి దిగ్విజయ్ మాటల్లో నిజానిజాలు ఆరాలు తీయాలనుకుని ముందు వంశీతో ప్రారంభించాను.

వంశీ గురించి దిగ్విజయ్ చెపిందాంట్లో అతిశయోక్తి లేదు. రసికరాజు అని పేరుపడ్డ అతగాడింకా పెళ్లి చేసుకోలేదు. చాలామంది యువతులతో సాన్నిహిత్యమున్నా అతడి ప్రవర్తనపై ఎక్కడా ఫిర్యాదులు లేవు సరికదా స్నేహపాత్రుడని మగవాళ్లచేతనే అనిపించు కుంటున్నాడు.

నేను అతడితో సాన్నిహిత్యమున్న ఇద్దరు యువతుల్ని ఏదో వంకన కలుసుకుని మాట్లాడాను. వారిలో ఒకామె వివాహిత. ఒకామెకి పెళ్లి నిశ్చయమైంది. ఆ ఇద్దరికీ పరస్పరం పరిచయం లేకపోయినా– వంశీ ద్వారా ఒకరి గురించి ఒకరికి తెలుసు.

వాళ్లని సూటిగా ఏమడగలేదు. నాకు కొన్ని పడికట్టు ప్రశ్నలున్నాయి. వాటికొచ్చిన జవాబులూ, అప్పటి వారి ముఖకవళికల్నీ బట్టి వాళ్లకతడితో ఇంటిమేట్ రిలేషన్‌షిప్ ఉన్నట్లు నిర్ధారించాను. వాళ్లకి అతడిపై ప్రేమానురాగాలూ, గౌరవభావమే తప్ప ఏ ఫిర్యాదూ లేదు.

వంశీ సామాన్యుడు కాదు. ఒకరా, ఇద్దరా– ఎందరో ప్రియురాళ్లు. అందర్నీ సంతోషంగా ఉంచుతున్నాడు. అందరితో స్నేహంగా ఉంటున్నాడు. ఏమిటతడి చిట్కా?

బ్లాక్‌మెయిలరనుకుందామంటే– అతణ్ణి చూసి ప్రియురాళ్లు భయపడ్డం లేదు. డ్రగ్స్ ఇస్తున్నాడనుకుంటే– అతడి చెలుల మానసికారోగ్యం తిరుగులేనిది. సమాజం హర్షించని దారిలో నడుస్తూ కూడా వాళ్లు ఎటువంటి డిప్రెషనుకీ గురి కావడం లేదు.

దిగ్విజయ్ ఊహలో వంశీకి సమ్మోహనశక్తి ఉంది. అదే ఉంటే– దాన్నతడు పలువిధాల ఉపయోగించి సమాజంలో ప్రముఖవ్యక్తి కావచ్చు. కానీ అతడా శక్తిని స్త్రీ వ్యామోహానికి ఉపయోగిస్తున్నాడు. అతడు కేవలం కాముకుడా?

వంశీని కలుసుకోవాలనుకున్నాను. నా ఛానెల్ ఉపయోగిస్తే ఆ రోజు సాయంత్రం అతడు చంద్రికా పార్కుకి వెడుతున్నట్లు తెలిసింది. వెళ్లాను.

నేను వెళ్లేసరికి వంశీ ఓ అమ్మాయితో మాట్లాడుతున్నాడు. నేను వాళ్ల మాటలు వినిపించేటంత దూరంలో కూర్చుని ఎటో చూస్తున్నట్లు అభినయిస్తున్నాను. వాళ్లకి మాత్రం నా గురించేకాదు, పరిసరాల స్పృహ కూడా ఉన్నట్లు లేదు.

ఆమె పేరు సరిత. వంశీనే పెళ్లి చేసుకుందామనుకుంది. పెద్దలు వేరే సంబంధం చూసారు. అది చేసుకోకపోతే చస్తామని బెదిరిస్తున్నారు. ఆమెకేమో ఆ అబ్బాయి నచ్చలేదు.

“నాకా అబ్బాయితెలుసు. చాలా మంచివాడు” వంశీ నచ్చజెబుతున్నాడు.

“పెళ్లయ్యేక చెడ్డవాడిగా మారితే?” సరితకి అనుమానం.

“అప్పుడు నేను నిన్ను పెళ్లి చేసుకుంటాను. సరా?” వంశీ ఆమెకి మాటిచ్చాడు.

నమ్మొచ్చా అనడగలేదు. ఇప్పుడే ఎందుకు చేసుకోవూ అని నిలదీయలేదు. ఆమె కళ్లలో నమ్మకం, ఆరాధనాభావం.

“థాంక్స్” అంటూ లేచి నిలబడిందామె. అతడు లేవకపోతే ప్రశ్నార్థకంగా చూసింది.

“మనమిక్కడికి కలిసి రాలేదు. కలిసి వెళ్లడమెందుకు?”

అది ప్రశ్నలా లేదు. ఆజ్ఞలా ఉంది. అదామె శిరసావహించి అక్కణ్ణించి వెళ్లిపోయింది.

అతడక్కడ ఎంతసేపుంటాడో తెలియదు. అందుకని చప్పున అక్కడికి వెళ్లాను. ఒంటరితనం భరించలేక పార్కుకొచ్చాననీ, కంపెనీకోసం ఎదురు చూస్తున్నాననీ చెప్పి అతడి ఎదురుగా చతికిలబడ్డాను. ఇద్దరం కబుర్లలో పడ్డాం.

నా పడికట్టు ప్రశ్నలకి బదులిస్తున్నప్పుడు– అతడి ముఖభావాలు వాటితో పెర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అయ్యాయి. నా అనుభవంలో అది చాలా అరుదైన సంఘటన. అంటే అతడు మాయామర్మం తెలియని సీదాసాదా మనిషనుకోవాలి.

సంభాషణ పెళ్లిమీదకి మళ్లినప్పుడు, "నాకు ప్రేమే ఇష్టం. ప్రేమని చంపేస్తుందని పెళ్లంటే భయం. స్త్రీ పురుషుల సాహచర్యానికి ప్రేమ అత్యావశ్యకం. రక్షణకోసం ఆడదీ, స్వార్థంకోసం మగాడూ పెళ్లి పేరిట ఒక పంచన చేరే వ్యవస్థ మనది. ఆ పెళ్లిలో ప్రేమ మనలేదు" అన్నాడు.

"అంటే పెళ్లివల్ల స్రీ పురుషులిద్దరికీ నష్టమంటారు"

వంశీ తల అడ్డంగా ఊపి, "స్త్రీ రక్షణ పేరిట స్వేచ్ఛని కోల్పోతుంది. స్వార్థం పురుషుణ్ణి విశృంఖలతకి కూడా ప్రోత్సహిస్తుంది. పెళ్లి పేరిట నష్టపోతున్నది స్త్రీ మాత్రమే!" అన్నాడు.

సుమారు గంట సేపు మాట్లాడుకున్నాం. అతడు చెబుతున్నాడు, నేను వింటున్నాను. "నైస్ మీటింగ్" అని అతడు లేచిన పావుగంట దాకా నేను నేను కాలేకపోయాను.

దిగ్విజయ్ చెప్పింది నిజం. వంశీలో ఏదో సమ్మోహనశక్తి ఉంది. అతడి మనసు లోతుల్లోకి వెళ్లి ఏమేమో రాబట్టాలనుకున్న నేను– అతడి భావాలకి ప్రభావితుణ్ణి కావడం మినహాగా మరేమీ సాధించలేకపోయాను. సైకలాజికల్ పవర్స్ ఉన్నాయనుకున్న నా పరిస్థితే ఇలాగుంటే– ఇక మామూలు ఆడపిల్లలతడి ధాటికి తట్టుకోగలరా?

వంశీని సవాలుగా తీసుకుని స్టడీ చేయాలనుకున్నాను కానీ– దిగ్విజయ్ కేసు త్వరగా సాల్వ్ చేయాలంటే– నేను వంశీతో స్టక్ ఐపోకూడదు.

ఇక విమలతో డీల్ చేయడానికి నా కజిన్ ప్రతిభని ఎన్నుకున్నాను. వరసకి మరదలు. ప్రొఫెషనల్ డిస్కషన్స్‌లో మా మధ్య ఇన్హిబిషన్స్ లేవు. నేనామెకి మొత్తం కథ చెప్పి విమల–వంశీల అనుబంధం గురించి తెలుసుకోమన్నాను. అది కత్తిమీద సామనీ– విలువల్ని నమ్మిన విమల చాలా సెన్సిటివ్ అనీ, ఏమాత్రం తొందరపడినా– ఆమెకి ప్రాణాంతకమనీ హెచ్చరించాను.

ప్రతిభ ఆమెని వంశీ ప్రియురాలిగా కలుసుకుని రెండు రోజుల్లో కొంత సమాచారం సేకరించింది. ఆ ప్రకారం విమల వంశీ వశీకరణశక్తిని ఏమాత్రం నమ్మదు.

"వశీకరణ విద్యకి లొంగేవి మృగాలు. ఆడది ఎన్నటికీ మృగం కాదు, కాలేదు" అన్నదట ఆమె. ఐతే వంశీ పట్ల ఆమెకు ఆరాధనా భావముంది, "వంశీ అంటే ప్రేమావతారం. అతడికి ప్రేమ తప్ప ఇంకేం తెలియదు. ప్రతిఫలం కోరని స్వచ్ఛమైన ఆ ప్రేమ ఆడదానికి అరుదైన వరం. పరిచయమైన ఏ స్త్రీ ఐనా అతడికి ఆత్మార్పణ కావించుకోకుండా ఉండలేదు. అదో భక్తిభావం. అందులో తప్పొప్పుల ప్రసక్తి ఉండదు" అంటుందట ఆమె. అ భక్తిభావాన్ని బలహీనతగా

తీసుకుని– వంశీ మోసం చేసే అవకాశముందంటే, "వంశీ ప్రేమికుడు. ప్రేమికుడు మోసగాడు కాలేదు. ఈ వ్యవస్థలో భర్తలు మాత్రమే మోసగాళ్లు కాగలరు" అన్నదట ఆమె.

ఇవన్నీ క్రోడీకరించి, "విమల వంశీకి లొంగితే– అది ఐచ్ఛికం. భర్తమీద కోపం, వంశీపట్ల ఆరాధన అందుకు కారణాలు కావచ్చు. వశీకరణ రూల్డ్ ఔట్" అని తేల్చింది ప్రతిభ.

ఈ సమాచారంతో నాకు నేరుగా విమలని కలుసుకునే ధైర్యం వచ్చింది. దిగ్విజయ్‌తో మాట్లాడి ఉదయం పదకొండింటికి అపాయింట్‌మెంట్ తీసుకున్నాను. నేను వెళ్లే సమయానికి అనుకోని పని పడిందనీ, అరగంటలో వస్తాననీ బయటికి వెళ్లిపోయాడతడు. అది ముందుగా చేసుకున్న ఒప్పందమని తెలియని విమలకి నన్ను ఎంగేజ్ చేసే డ్యూటీ పడింది.

విమల వ్యక్తిత్వం గురించి దిగ్విజయ్ ద్వారా అందిన సమాచారం సరైనదేనని తెలుసుకుందుకు నాకెంతోసేపు పట్టలేదు. ఇక వంశీతో రొమాన్స్ గురించి తెలుసుకోవాలి. అది సున్నితం కాబట్టి– కొంత హిప్నాటిజం తప్పని సరి అయింది.

పదంటే పది నిముషాల్లో విమలకి నేను ఆత్మీయుణ్ణైపోయాను. అప్పుడామె మనసు లోతుల్లోంచీ అన్నీ నిజాలే చెప్పినా– చెబుతున్న విషయమామెకి తెలియదు.

దిగ్విజయ్‌కి వంశీలా రొమాంటిక్ లైఫ్ గడపాలని మనసు. వంశీలాంటి వ్యక్తిత్వం సంతరించుకోలేక– అందుకు తగిన ఆస్తి, అంతస్తు, హోదాలకోసం ప్రాకులాడాడు. వాటికోసమే విమలని పెళ్లాడాడు. విలువల్ని నమ్మిన విమల తనకి ఆత్మార్పణ చేసుకుంటే– డబ్బుకి అమ్ముడుబోయే పరస్త్రీల పొందుకి ప్రాకులాడాడు. అది విమలకి తెలిస్తే ప్రమాదమని– ఆమెనే అంతం చేయాలనుకున్నాడు. శీలం పోతే మరణమే శరణ్యమనుకునే ఆమె శీలాన్ని– వంశీ హరించే పరిస్థితి కల్పించాడు. తన తప్పు లేకుండా ఆమె చనిపోతే– ఆమె ఆస్తికి వారసుడిగా కలకాలం సుఖపడాలనుకున్నాడు. అతడి మోసం తెలిసేకనే– ఆమె ఒక రాత్రంతా వంశీని తన ఇంట్లో ఉండనిచ్చింది.

"దిగ్విజయ్‌కి సంబంధించినంతవరకూ నా శీలం పోయింది. నాకు సంబంధించినంతవరకూ నేను బ్రతికే ఉంటాను. నన్ను భరించాలంటే అతడో సగటు మగాడు. ఎదిరించాలంటే పిరికివాడు. జీవితాంతం దిగ్విజయ్‌కి నరకం తప్పదు"

"అంటే నువ్వు నీ భర్తని శిక్షించాలనుకున్నావు. అది వంశీకి వరమైంది" అన్నాను.

"ఆడపిల్లకి అసలుసిసలు నిస్వార్థ ప్రేమని రుచి చూపించి ఆమె తనంత తానుగా అర్పించుకుంటే– గౌరవభావంతో అక్కున చేర్చుకునే ప్రతి మగాడూ ప్రేమ రాగాలు పలికే ఓ వంశీ! ప్రేమ వరాలిచ్చే ఆ దేవుడికి భక్తులు లభించడమే వరమని మీరనుకుంటే– ఆ వరాన్నిస్తున్నది దిగ్విaజయ్‌లాంటి మగాళ్లే!" అంది విమల.

ఆ మాటలు దిగ్విజయ్‌కే కాదు– మగాణ్ణి కాబట్టి నాకూ హెచ్చరికే అనిపించాయి.

ఇంతకీ వంశీదీ ఆమెదీ ఎలాంటి అనుబంధమో– రాబట్టడానికి నా సైకలాజికల్ పవర్ సహకరించలేదు. అసలామె హిప్నటైజ్ అయిందా– లేక ఐనట్లు నటించి తను చెప్పాలనుకున్నవి చెప్పిందా అన్న అనుమానం కూడా నాలో కలిగింది. ఐతే దిగ్విజయ్‌కి ఏంచెప్పాలన్న సందిగ్ధమిక నాలో లేదు. ఆఫీసుకి వెళ్లేక ఫోన్ చేసి, “డోంట్ వర్రీ! విమలకి జరిగింది తెలుసు. ఆమె ఆత్మహత్య చేసుకోదు. మిషన్ అచీవ్డ్!” అని చెప్పాను.

బహుశా విమలతోపాటు నేనూ అతడికి శిక్ష వేసానేమో!

–––o–––

COMMENTS